# పశ్చాత్తాపం

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

నేనూ, రావూ కాలేజీలో చదువుకునే రోజుల్లో హాస్టల్లో ఒకే గదిలో వుండేవాళ్లం. తక్కిన విద్యార్థులంతా ఎల్లప్పుడూ, క్లాసుపుస్తకాలు చదవడంలోనో, ఆటల్లోనో కాలక్షేపం చేస్తుంటే మేము వీలయినపుడల్లా న్యూసు పేపర్లు చూస్తూండేవాళ్ళం. మన దేశాన్ని గురించి, రాజకీయాల గురించి, తరచు వాదించుకుంటూండేవాళ్ళం. రావు అప్పటినుంచీ, గాంధీ భక్తుడే. కాంగ్రెసు, నాన్ కోపరేషను, నాన్ వైలెన్సు, రాట్నాలు దేశవిముక్తికి మార్గమని చేసే ప్రచారంతో పూర్తిగా యేకీభవించేవాడు. కాని, నాకు వాటిని గురించి అనేక అనుమానాలుండేయి. రాట్నాలు, ఖద్దరు కొన్ని యేండ్లక్రిందట అన్నిచోట్ల వున్నవేగా ? పోయే స్వాతంత్ర్యాన్ని ఆపలేని అవి స్వాతంత్ర్యాన్ని తిరిగి తెస్తాయా అనేవాడిని. రావు మాత్రం ఆ కార్యక్రమాన్ని గురించి అత్యుత్సాహం చూపేవాడు.

1929 వత్సరంలో గాంధీగారు ఆంధ్రదేశ సంచారం వచ్చారు. మా పట్టణంలో వుండే కాంగ్రెసు నాయకులు కాంగ్రెస్ ప్రచారకులు ఆహ్వానపు యేర్పాటుల్లో మునిగి తేల్తున్నారు. రావు విద్యార్థులను, వారుకూడా Wel-Come ఎడ్రసు, పర్సు యిచ్చేటటుల ప్రోత్సాహపరిచాడు. ఈ ఉత్సవాలన్నిటిమధ్య ఒక బెడదవచ్చి పడింది. డాక్టరు అంజి పాకీవాళ్ళ నందరిని ప్రోగుజేసి బ్లాక్ ఫ్లాగ్ డిమాన్‌స్ట్రేషన్ (నల్ల జెండాల వూరేగింపు) బయలుదేరతీసే ప్రయత్నాలు చేస్తున్నాడు. కాంగ్రెసువారు ఊరేగింపులు జేసి "జగద్రక్షకుడు గాంధిమహాత్ముడం"టూ వారి కివ్వటానికి డబ్బు పోగుజేస్తూంటే, డాక్టరూ వారి కార్మిక శిష్యులు "గాంధి ధనికుల యేజంటు, బహిష్కరించడం"టూ నల్ల జెండాలతో వూరేగింపులు సాగించారు. అప్పట్లో డాక్టరుగారి ప్రవర్తన నేనూ అర్థం చేసుకోలేను. ఇక రావుకూ కాంగ్రెసు వాళ్ళకూ పానకంలో పుడకల్లేనే వుంది. డాక్టరును దూషించుతుండేవాళ్లు. డాక్టరు ఏవేవో దావా చిక్కుల్లో వున్నాడనీ గవర్నమెంటువారి మెహర్బానీ సంపాదించాలనే వుద్దేశంతో గాంధీ వ్యతిరేక ప్రచారం చేస్తూన్నాడనీ గాలివార్తలు బయలు దేరాయి. రావు అవన్నీ నిజమేనని వాదించాడు. జిల్లా కలెక్టరు నల్లజెండాల వూరేగింపు నిషేధిస్తూ ఆర్డరిచ్చాడు. దానితో మా రావూ, కాంగ్రెసువారూ సంతోషించారు. డాక్టరుకు తగినశాస్తి జరిగిందన్నారు. నా పని ఆలోచనలో పడింది. డాక్టరు కాంగ్రెసుకు ప్రతికూలమై, ప్రభుత్వానికి అనుకూలమే ఐతే యీ నిర్బంధం, యీ ఆటంకం ఎందుకా అని నా అనుమానం.

ఆ రోజు సభలో ఓ కాంగ్రెసువాది "పిచ్చి వెధవలు పాకీవాళ్లు గాంధికి యెదురా ? As king with king గాంధీ గవర్నమెంటు పోరాడాలి గాని" అన్నాడు. రావు మహా బాగా చెప్పారన్నాడు. నాకు వళ్లు మండింది. "పాకీవాళ్ళూ మానవ సమాజంలో ఒక భాగమేగా ? వాళ్లు అతి హేయంగా చూడబడే పని చేస్తున్నా సమాజానికి సేవ జేయడంలో ఎవరికీ తక్కువగాదే ! అలాంటపుడు వాళ్లు గాంధికి ఎదురేమిటి అనడం అహంకారమే. కాంగ్రెసువాళ్లు కోరే స్వరాజ్యం నిరంకుశులైన జమీందారీ హుకుమ్‌లోని ప్రజాపీడనే" అన్నా నేను. రావు నీకన్నీ అనుమానాలే ఎపుడూ అన్నాడు.

* * *

ఆరు సంవత్సరాలు గడిచినాయి. రావు గాంధీ భక్తుడు మాత్రమే గాకుండా కాంగ్రెసు అనుచరుడై పోయాడు. సత్యాగ్రహోద్యమంలో రెండుమార్లు జైలుకు పోయాడు. దెబ్బలు తిన్నాడు. ఎంతో పట్టుదలగా ప్రచారం చేసాడు. గాంధిగార్ని ప్రతి విషయమును అనుకరిస్తూ పచ్చి గింజలు కాయలు మేయడం మొదలెట్టాడు. జైల్లో చెడిన ఆరోగ్యం యీ పరిశోధనా ప్రయత్నాలతో పూర్తిగా చెడి సన్నగిల్లాడు. (నాజూకు శైలి గాంధిగారివలే వున్నాననుకుంటున్నాడేమో మనస్సులో! తెలియదు) సత్యాగ్రహం చల్లబడిన దగ్గరనుంచి హరిజన ప్రచారంలో దిగాడు. ఈ మధ్యనే మేమిద్దరం కలుసుకున్నాం. చదువుకొనే కబుర్లు కులాసాగా చెప్పుకొన్నాం. మా ప్రసంగం రాజకీయాలు హరిజనోద్ధరణ వైపు మరలినది. రావు, "గాంధి మహాత్ముని అకుంఠిత దీక్షతో ప్రారంభింప బడిన హరిజన సేవాసంఘంవారి ప్రచారంతో అస్పృశ్యత రూపు మాసిపోతుంది. హరిజనుల కష్టాలన్నీ పోయి సమాజంలో గౌరవస్థానం పొందుతారు.

నేను:-శుద్ధ బాబు! మీరు హడావుడీ చేసినంత మాత్రాన వార్తా పత్రికలు నిండుతాయే గాని వాళ్ళ స్థితి ఏం బాగుపడను. వాళ్లు అంత దీనస్థితిలో వుండటానికి కారణం ఆర్థికమే వాళ్లు మురికిగా అనారోగ్యంగా వుండటానికి కారణం డబ్బు లేమియే!

రావు:-వాళ్లు త్రాగుడూ వగైరా దురలవాట్లకు డబ్బు తగలేస్తారు. మా ప్రచారంవల్ల అవి మానేస్తే వాళ్లు బాగుపడతారు.

నేను:-ప్రొద్దస్తమానం వళ్లు విరచుకు పని జేస్తారు. విశ్రాంతి యెరుగరు. రాత్రిపూట నీరసంగా మురికి గుడిశెలకు జేరుకోవాలి. (అవీ కొందరికి వుండవు.) హీనస్థితిలో వుండే కుటుంబం, పరిసర పరిస్థితులు భరింపరానివిగా వుంటాయి. కృత్రిమంగా నైనా హుషారీ తెచ్చుకోడానికి త్రాగుతాడు. వాడిని అంటే ఏం లాభం? వాళ్ళకీ శుభ్రమైన తిండికీ, వునికీ సరిపడిన ఆదాయం వుంటే బాగుపడతారు.

రావు:-అందుకే గ్రామ పరిశ్రమల సంఘం. తద్వారా వాళ్ళ ఆర్థికస్థితి బాగుచేయ పూనుకొన్నాడు మహాత్ముడు.

నేను:-20-వ శతాబ్దపు యంత్ర యుగంలో—నీ రాటాలూ వడ్లదంపుడూ, ఏమి చేస్తుంటాయి.

రావు:-యంత్రాలవల్లనేగా పని లేక పోవడం. నా చేతి పరిశ్రమవల్ల అందరికి పని దొరికి సమానత వస్తుంది.

నేను:-పూర్వం లేవా యీ చేతి పరిశ్రమలు. యంత్రాలు రావడంతోనే వాని పోటీకి ఆగలేక అవి నశించినాయి. మరల ఎలా పునరుద్ధించ గలుగుతావోయి వాటిని.

రావు:-అపుడు విదేశ ప్రభుత్వం గావడం వల్లనే. ఇపుడు ప్రచారం సాగించి ప్రజలభిమానించేటటుల చేస్తాం. మళ్లా ప్రజలందరూ సుఖపడతారు.

నేను:-పర ప్రభుత్వాలు లేని దేశాల్లోకూడా చేతి పరిశ్రమలు నశించినాయిగా! అపుడు హైందవ రాజుల కాలంలో మాత్రం ప్రజలు సుఖపడ్డారంటావా? ప్రజలు కష్టపడుతూంటే, రాజులు. జమీందారులు నిరంకుశత్వంగా యేలేవారు. అసలు యంత్రాలు రావడంవల్ల ప్రజల కష్టం తగ్గాలి కాని, ప్రజల దారిద్ర్యానికి కారణం అవికావు. ఎందువల్లనంటే ఎంతో మంది ఎంతోకాలం కష్టపడి చేసేపనిని కొలదిమందే యంత్రాల సహాయంతో అనాయాసంగా చేస్తారు. పైగా యంత్రాల సాయంతో, అసాధ్యమని యెంచబడిన అనేక పనులను, ప్రకృతిని జయించివేస్తున్నారిపుడు.

రావు:-ఐతే వచ్చిన లాభమేమిటి ప్రజలకు, కూడు లేకుండా పోతూంటే చాలామందికి.

నేను:-నిజమే! కాని తలనొప్పికి తగిన మందెయ్యాలి గాని, తలే తీసివేస్తాననడం వెర్రితనం కాదూ. ఇపుడు యంత్రాలు వ్యక్తుల చేతుల్లో వుంటంవల్ల వాళ్లు లాభాలకోసమే పని చేయించుతారు. అందువల్లే నిరుద్యోగం; కొంతమంది ధనంతో మూలగడం; ప్రజల్లో యెక్కువ భాగం తిండిలేక మాడటం. యంత్రాలు సమాజ ఆధీనంలో వుండి అందరి లాభం కొరకు పని జేయించిన ప్రజల కష్టం తగ్గుతుంది. జీవితానికి కావలసిన వస్తువులు అందరి అందుబాటులో వుంటాయి. పని చెయ్యాలిసిన గంటలు తగ్గి ప్రజలకు విద్యా విజ్ఞానాలు పొందే అవకాశముంటుంది. కనుక ఉత్పత్తి సాధనాలు సమాజము పాలు చెయ్యాలీ గాని, యంత్రాలను బహిష్కరించ గూడదు. అది అసాధ్యంకూడా.

రావు:-మరి చరఖాసంఘం, గ్రామ పరిశ్రమల సంఘం చాలా బాగా పనిచేస్తున్నవిగా,

నేను:-దానికేమి లే. దేశభక్తి వుత్సాహాల పుణ్యమా అంటూ లక్షలకొలది ధనం ప్రోగుజేసారు. ఈ లక్షలతో బండి కొంతకాలం సాగుతుంది. క్రమంగా యివన్నీ మూలబడేవే. అయితే రావూ! మద్రాసులో అ. భా. కాంగ్రెసు కమిటీ సంస్థాన ప్రజల గురించిన తీర్మానం, బాగుందీ?

రావు:-చక్కగా వుంది. సంస్థానాధిపతులు ఇండియన్లేగా! వాళ్ళతో పోరాటం తెచ్చుకోడ మెందులకూ?

నేను:-మీరు కోరే స్వరాజ్యం అలాంటిదే నేమిటి? అక్కడి ప్రజలు మనకంటే యెక్కువగా బాధపడడం లేదా?

రావు:-నిజమే. పటేలుగారు చెప్పలా అక్కడ ప్రచారమే అసాధ్యమని పైగా బ్రిటీషుతోపాటు, సంస్థానాధీశులతో పోరాటం అసాధ్యం కాదూ. ఇంతమాత్రం రాజనీతి తెలిసికొనకపోతే యెలా?



నేను:-ఇవుడుమాత్రం వారు స్వరాజ్యానికి తోడ్పడుతున్నారా? ఒక్క వుదాహరణ చూపించవోయి. ప్రజలనుండి పాలనా సంస్థతోబాటు జమీందార్లు, షాహుకార్లు అనవసరంగా విపరీతమయిన లాభాలు పొందుతున్నారు. వాళ్ళంతా యీ ప్రభుత్వంక్రింద సుఖపడేవాళ్లే కాబట్టి, వాళ్ళకి స్వరాజ్యం అక్కర లేదు!

రా:-అలా అంటావేం. కాంగ్రెసు నాయకుల్లో చాలా మంది భాగ్యవంతులేగా, వాళ్లు పోరాడటం లేదా?

నేను:-అందుకే ఎప్పటికప్పుడు తడబడి ప్రజాశక్తిని వృధా చేస్తున్నారు. స్వాతంత్ర్యం మాటల్తో రాదు. క్లిష్ట పరిస్థితుల్లో వీళ్లంతా ఇంటిదొవపట్టి దగా జేసేవాళ్ళే. కష్టపడే వాళ్ళకే నిజంగా స్వరాజ్యం కావాలి, వాళ్లే తేవాలి;

రావు:-నీదెపుడూ గాంధిగారి సత్యాగ్రహం ద్వారానే స్వరాజ్యం తేవాలి. ఇంకో మార్గం లేదు. రావు నమ్మదలచక తన పనిలో నిమగ్నుడయ్యాడు.

౩

రావు గాంధీ తత్వమును తప్ప యింకో విధానాన్ని గురించి సహేతుకమైనా ఆలోచనకన్నా అవకాశమివ్వడు. అయినా తన పద్ధతిని హృదయపూర్వకంగా నమ్ముతాడు. అతడు ఛోటా గాంధీల మాటలు తూచా తప్పకుండా నమ్ముతాడు. అదొకటే అతనిలో వున్నలోటు. వారి విధానాలన్నీ మనఃస్ఫూర్తిగా ఆచరించడానికి ప్రయత్నిస్తాడు. అందరూ అంతే ననుకుంటాడు.

కాంగ్రెసు ప్రెసిడెంటు ఆంధ్రదేశ సంచారం చేస్తున్నాడు. మా పట్టణం కూడా వస్తాడు. కాంగ్రెసు నాయకులంతా ఆహ్వానానికి బ్రహ్మాండమైన ప్రయత్నాలు చేస్తున్నారు. డబ్బువసూలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో తమకూడా స్థానం సంపాదించుకో డానికి తగిన ప్రాముఖ్యం పొందడానికి హడావుడీ చేస్తున్నారు ఎవరికి

వారే. మన రావుకూడా ప్రెశిడెంటుకు బ్రహ్మాండమైన స్వాగతం యివ్వాలని వాలంటీర్లను ప్రోగు చేస్తున్నాడు.

ఉదయం రైలులో దిగాడు ప్రెసిడెంటు. కాంగ్రెసు వారు వూరేగింపు యేర్పాటు చేసారు. త్రోవపొడుగునా జెండా కర్రలతో వాలంటీర్లు నించున్నారు. కాని యీ మహా వుత్సవానికి ఒక బెడద వచ్చి పడింది. నాయకులు మొఖాలు మొత్తినవి. 50 మంది యువకులు, వాళ్ళల్లో చాలమంది కాంగ్రెసులో దీమాగా పనిచేసిన వాళ్లే నల్ల జెండాలు పుచ్చుకుని, "కాంగ్రెసు భాగ్యవంతుల మాటప శిరసావహిస్తుంది. "పదవులకోసం ప్రాకులాడుతూంది." వగైరా వ్రాసిన అట్టలు పుచ్చుకొని వూరేగుతూవచ్చారు. కరపత్రాలు పంచిపెట్టారు. వానిలో కాంగ్రెసు అనేకసార్లు ధనవంతులను ఆశ్రయించిన దనే వివరాలున్నవి. నాయకులు యీ నల్ల జెండాలు తమ ప్రతిభకు లోటనుకున్నారు. ఇదంతా 'జస్టిసు' పతకమని వాలంటీర్లు చెవుల్లో వూదారు. అలజడి ప్రారంభమయింది. వాలంటీర్లు జెండా కర్రలను త్రిప్పారు. త్రోపులాట సాగింది.

ఇదంతా జూచి రావుకు గాంధిగారి 'సత్యం, అహింస' అంటే వున్న మైకం వదలిపోయింది. ప్రతికూల దర్శనంలో వున్న వాళ్లు తనతోపాటు త్యాగం జేసిన వాళ్ళే. వాళ్ళని 'జస్టిసు' ఏజెంట్లని నాయకులనడం సహించలేకపోయాడు. వారిపై తనకుండే గౌరవమంతా పటాపంచలైపోయింది. వారిప్రోత్సాహంతో వాలంటీర్లు కర్రలు పయోగించడం వీరి అహింసా తత్వనిదర్శనమా ? అనుకున్నాడు.

ఆ రాత్రే రావు నాదగ్గరకువచ్చి తానింతవరకు భ్రమలో వున్నాననీ ఇకనుంచి తనపద్ధతి మార్చుకుంటాననీ, కాంగ్రెసువారి, అహింసా సత్యాలు ఆలోచించితే వట్టిదగాబాజీగా కాన్పిస్తూందనీ ఒప్పుకున్నాడు.

యువదంపతులకు 50 గ్రంథముల

శృంగారమార్గము సారాంశము

# సతీపతికుతూహాల రహస్యములు.

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి సాస్వాదనము చేయుటయే గాక కామశాస్త్రమును తప్పక పఠించెడువారు. రాణివాసమందలి కాంతలకుకూడ దీనిని నేర్పెడివారనివాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడీ కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారి యపరాధము కాదు, తగిన గ్రంథము లేకపోవుటే దీనికి ప్రధాన కారణమున నేడీ కొరత తీరినది. సతీపతి కుతూహాలరహస్యమను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామకళా గ్రంథవిషయములతో నిండి యీ కళాసంబంధమగు పూర్ణజ్ఞానమును కలిగించుచున్న ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది.

గ్రంథము వెల 2 రూపాయలు.

పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,

19, తాండవరాయ మొదలి వీధి,

తిరువళ్లిక్కేణి, మదరాసు.